బాక్సింగ్‌లో జిల్లాకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి 7వ ఎలైట్ పురుషులు, మహిళల బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారులు రెండు స్వర్ణ, రెండు రజిత, ఐదు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్వగహానికి చేరుకున్న క్రీడాకారులను ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలను చేకూర్చి నగరానికి క్రీడా పరంగా మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోల మన్మధ కుమార్ మాట్లాడుతూ జి అచ్యుతరావు, ఎ.సాయి బంగారు పతకాలు, సాధించా రన్నారు. చంద్రశేఖర్, జగదీష్ నాయుడు రజిత పతకాలు సాధించగా, దేవకేశ్వరరావు, సుల్తానా, సుమిత్ర, రాధా, మాధురి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ క్రీడాకారులు ఈనెల 26న మేఘాలయలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనున్నారని చెప్పారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు ఎస్ఇ రాజు, కోచ్ డి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

చివరి లోనూ కన్నీరే

చిరు జల్లులతో గుబులు • రైతులకు తప్పని కష్టాలు

ప్రజాశక్తి-విలేకర్లు

ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేసిన రైతులకు చివరకు కష్టాలే మిగులుతున్నాయి. ఓవైపు తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొనగా, మరోవైపు అక్కడక్కడా పండిన వరిచేలను కోత కోసే సమయంలో పడుతున్న స్వల్ప వర్షాలు రైతులను నట్టేటా ముంచుతున్నాయి. పొలాల్లో ఉన్న వరిచేలను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు.

వంగర : మండలంలో కురిసిన స్వల్ప వర్షంతో పొలాల్లో కోసి ఉన్న వరిచేలు తడిచిపోయాయి. ఈ ఏడాది వర్షా బావ పరిస్థితుల వల్ల ఎన్నో అప్పులు చేసి పొలంలో కష్టపడి వరి పంటను కొంతమేరైనా రక్షించుకోవాలని ఉద్దేశంతో చివరి దశలో మోటార్లతో నీరు తోడి కాపాడుకున్నప్పటికీ మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాలలో రైతులు తమ తమ పంటలను కోత కోసి పొలాలలోనే ఓవులుగా వేసి ఉంచారు. వాతావరణం ఒక్కసారిగా మారడంతో ఆందోళన చెందుతున్నారు.

మెంటాడ : మండలంలో ఆకాల వర్షాల వల్ల వరి రైతులకు నష్టం వాటిల్లింది. గతమూడు రోజులుగా రైతులు వరి కోతలు మొదలుపెట్టారు. ఈ దశలో వర్షం పడడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ఉరుకులు పరుగులతో పొలాల్లోనే గాలి దిబ్బలు పెట్టారు. వాటిని కప్పి ఉంచేందుకు టార్పాలిన్లు కోసం పరుగులు తీశారు.

లక్కవరపుకోట : మండలంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి కోసిన వరి చేను తడిసింది. వరి చేను పండేందుకు అవసరమైన సమయంలో వర్షాలు పడకపోయినా చెరువులు, బోరు బావులు నుండి నీరునుతోడి అతి కష్టాల మీద రైతులు వరిని పండించారు. తీరా చేతికి అందించిన వరి పంటను కోతలు కోయడంతో వర్షానికి తడిసి ముద్దయింది. చేతికి అందోచ్చిన పంట వర్షానికి తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 9605 ఎకరాలు సాధారణ విస్తీర్ణ ఉండగా ఈ ఏడాది 9176 ఎకరాలలో వరి పంట వేశారు. వాటిలో సుమారు 510 ఎకరాలలో పండిన వరి పంటను కోశారు. కోసిన పంటను కొన్ని ప్రాంతాలలో కుప్పలు పెట్టుకోగా మరికొన్ని చోట్ల పొలాల్లో ఆరబెట్టారు. ఆరబెట్టిన వరిచేను మాత్రమే ఉదయం నుంచి కురుస్తున్న జల్లులకు తడిచినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిని స్వాతి వెల్లడించారు. కోసిన పంట 4 రోజుల వరకు ఆరబెట్టకుండా కుప్పలు వేయకూడదని రైతులకు సూచించారు. కురిసిన జల్లులకు ఎటువంటి నష్టం ఉండదని తెలిపారు.

రేగిడి : వర్షానికి పలు గ్రామాల్లో వరి చేలు తడిసి ముద్దయ్యాయి. మండలంలో 12,662 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 3వేల ఎకరాలలో కోసిన వరిచేలు వర్షాలకు తడిశాయనివ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలలో తక్షణమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రేగిడి మండలంలో తడిచిన వరిచేలు చూపిస్తున్న రైతులు

బొబ్బిలి మండలంలో వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతులు

వంగర మండలంలో పొలంలో తడిచిన వరిచేలు

మత్స్యకారులకు నిరాశ

- లబ్ధిదారుల జాబితాపై జెడ్‌పి చైర్మన్ ఆగ్రహం
- నిలిచిపోయిన ద్విచక్ర వాహనాల పంపిణీ
- థర్డ్‌పార్టీతో జాబితా పరిశీలనకు ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

తమకు మంజూరైన ద్విచక్ర వాహనాలు పొందేందుకు ఎంతో ఆశతో వచ్చిన మత్స్యకారులకు తీవ్ర నిరాశ ఎదురైంది. జాబితాలో డ్రైవింగ్ లైసెన్సులేని మహిళలు, పురుషులు ఉండడం, అర్హుల పేర్లు లేకపోవడంతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మత్స్యశాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పంపిణీని నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో మత్స్యకార దినోత్సవానికి హాజరైన మత్స్యకారుల్లోను, అధికారుల్లోను నిరాశ నెలకొంది.

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో 32 మంది లబ్ది దారులకు 24 లక్షల విలువైన ద్వి చక్ర వాహనాలను, ఎస్‌సి వర్గానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు 33,29,798 లక్షల విలువైన రెండు ఫిష్‌సీడ్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను, రూ.20 లక్షల విలువైన ఇన్సులేటెడ్ వాహనాన్ని అందజేసేందుకు లబ్ధిదారులను పిలిచారు. వాటిని పంపిణీ చేసేందుకు మత్స్యశాఖ ఎడి నిర్మలా కుమారి జాబితా అందించారు. దాన్ని పరిశీలించి జెడ్‌పి చైర్మన్ ఆరుగురు మహిళల పేర్లు ఉన్నాయి. ఒకరిని పిలిచి నువ్వేనమ్మా లబ్ధిదారు అని అడిగారు. నీకు టూ వీలర్స్ లైసెన్స్ ఉందా అని ప్రశ్నించగా, లేదని ఆమె చెప్పింది. దీంతో ఎడిపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ లబ్ధిదారుల జాబితా ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. మహిళా కోటాలో ఆమెకు వచ్చిందని ఎడి చెప్పినా చైర్మన్ ఇది కరెక్టర్ కాదని చెబుతూ అసహనం వ్యక్తం చేశారు. 'ఈ టూ వీలర్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేయండి' అంటూ జాయింట్ కలెక్టర్ మయూర అశోక్‌ను ఆదేశించారు. జాబితాపై ఒక కమిటీ వేసి విచారణ చేయాలని సూచించారు. దీంతో ఎంతో ఆశగా వచ్చిన మత్స్యకారుదారులు నిరాశతో వెనుదిరిగారు.

అనంతరం రెండు ఫిష్‌సీడ్ ట్రాన్స్‌పోర్టు వాహనాలను, ఇన్సులేటెడ్ వాహనాన్ని లబ్ధిదారులకు జెడ్‌పి చైర్మన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఫిష్ ఆంధ్ర పేరుతో టౌన్ లోను చిన్నచిన్న పట్టణాల్లోనూ ఏర్పాటు చేసి మంచి చేపలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. చేపల వేట విరామం సమయంలో మత్స్యకారులకు జీవన భృతి చెల్లిస్తున్నామన్నారు. మత్స్య కార వృత్తి పైనే ఆధార పడి, మత్స్య వ్యాపారాలు చేసే వారికి ప్రభుత్వం అనేక రకాలుగా ఉపకరణాలను అందించడమే కాకుండా వేట నిషేద సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం భృతి కల్పిస్తుందని అన్నారు. ఈ నెల 20న విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో బోట్లు కాలిపోయిన వారికి 80 శాతం వరకు ప్రభుత్వమే ఇన్సురెన్సు ను భరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు బర్రి చిన్నప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

తైక్వాండో పోటీల్లో జిల్లాకు 24 పతకాలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

గుంటూరులో ఈనెల 18,19 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్ర తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడా కారులు 24 పతకాలు సాధించి సత్తా చాటారు. వీటిలో 10 గోల్డ్ ,9 సిల్వర్ ,5 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌నాగలక్ష్మి

రక్తహీనతను నివారించాలి

రిఫరల్ కేసులకు నెలాఖరులోగా వైద్యం అందాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

రక్త హీనతను నివారించేందుకు కృషి చేయాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పదిహేను రోజుల్లోగా కౌమార బాలికలందరికీ హీమోగ్లోబిన్ రక్త పరీక్షలను పూర్తి చేసి, అవసరమైన వారికి మందులను అందించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులు, గర్భిణులు, కౌమార బాలికల్లో రక్తహీనత తదితర అంశాలపై వైద్యారోగ్యశాఖ అధికారులు, వైద్యులు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బందితో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెలాఖరులోగా జగనన్న ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసులన్నిటికీ వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. కొన్ని పిహెచ్‌సిల పరిధిలో కనీసం 20 శాతం కేసులకు కూడా వైద్యం అందించకపోవడం పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రిఫరల్ కేసుల్లో రోగులను తరలించే బాధ్యత వైద్యాధికారులదేనని స్పష్టం చేశారు. ప్రతీ రోగినీ సమీప సిహెచ్‌సి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆదేశించారు. వారి రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. వైద్యం అందించిన తరువాత ఇకెవైసి నమోదు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2,439 రిఫరల్ కేసులు నమోదు చేయగా, ఇప్పటివరకు 569 మందికి మాత్రమే వైద్యం అందిందని, మిగిలినవారికి కూడా మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఐరన్, సుక్రోజ్ ఇంజక్షన్ల కోసం గర్భిణులను అవసరమైతే తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్‌లలో ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పిఎ రమణి తదితరులు పాల్గొన్నారు.

27, 28న మహాధర్నాకు కదలిరండి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు విజయవాడలో ఈనెల 27,28 తేదీల్లో జరిగే కార్మిక,రైతు మహాధర్నాకు జిల్లా నుంచి వందలాదిగా కదిలిరావాలని కార్మికులకు,రైతులకు, ప్రజలకు ఎపి రైతు సంఘం పిలుపునిచ్చింది. మంగళవారం ఎన్‌పిఆర్ భవనంలో కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు, రైతులకు, ప్రజలకు, దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుండి దింపటమే మార్గమన్నారు. కొత్తగా కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు ఈ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి భయపడే స్థాయిలో కార్మిక,రైతు ఐక్య పోరాటాలు పెరగాలని, ఈ నేపథ్యంలో విజయవాడ మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పోరాటాలకు తలొగ్గి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఆ సందర్భంలో కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును వెనక్కి తీసుకుంటామని చేసిన వాగ్దానాలను నెరవేర్చలేదన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను లేబరు కోడ్‌ల రూపంలో కాలరాస్తోందన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచుతామని ప్రకటిస్తున్నాయని తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి జరగాల్సిన త్రైపాక్షిక భారత కార్మిక మహాసభను మోడీ ప్రభుత్వం 2015 నుండి జరపటం లేదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ ను పునరుద్ధరించాలని కోరుతూ పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతున్నాయి. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నిర్ణీత కాలపరిమితి ఉద్యోగాల పేర్లతో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులు, ప్రజల తిరుగుబాట్లతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించలేని మోడీ ప్రభుత్వం నగదీకరణ పేరుతో ప్రజల ఆస్తులైన విద్యుత్, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, జాతీయ రహదారులను లీజుకు కార్పొరేట్లకు ఎటువంటి పెట్టుబడి పెట్టకుండానే ధారదత్తం చేస్తోందని అన్నారు. విద్యుత్తు, ఇంటిపన్నులు, రవాణా ఛార్జీలను పెంచి కార్మికులపై భారాలు మోపుతోందన్నారు. బిజెపి విషపూరిత మతతత్వ విధానాలను విమర్శించటానికి సైతం ప్రభుత్వంలోని వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు సిద్ధపడటం లేదన్నారు. ఈ నేపథ్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మొదిలి శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు అప్పలసూరి, రైతు సంక్షేమ జిల్లా అధ్యక్షులు లక్ష్మ నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.అప్పారావు, జి. శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. రాములు, క్రాంతికార్ సంఘం నాయకులు తిరుపతిరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, బి.సుధారాణి, పట్టణ అధ్యక్షులు జగన్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బలస శ్రీను, ఎ.సురేష్, బి.జసూర్యనారాయణ, పెంటరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్ మాథుర్

రెండు నెలల పాటు సంకల్ప్ యాత్ర

అర్హులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు

కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి రోహిత్ మాథుర్

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలను అర్హులైన వారికి చేర్చడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ సంయుక్త కార్యదర్శి రోహిత్ మాథుర్ చెప్పారు. నవంబరు మూడో వారంలో జిల్లాలో ఈ యాత్ర ప్రారంభమై రెండు నెలలపాటు జనవరి 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ యాత్ర నిర్వహణకోసం జిల్లా ప్రభరీ అధికారిగా నియమితులైన కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారుల కమిటీతో సమావేశమయ్యారు. కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి వాటిని వినియోగించుకునేలా చైతన్య పరచడం, అర్హులై ఉండి పథకాలు పొందలేని వారిని గ్రామాల్లో జరిగే యాత్ర సందర్భంగా గుర్తించి వారికి ఆయా పథకాల ప్రయోజనాలు అందేలా చూడటం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అర్హులైన వారికి అవసరమైన డాక్యుమెంట్లు లేని పక్షంలో వాటిని సమకూర్చి పథకాలు మంజూరు చేయడంలో అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని కోరారు. ఉజ్వల యోజన పథకం కింద జిల్లాలో ఇంకా అర్హులైన వారు మిగిలి వుంటే ఈ యాత్రలో భాగంగా వంటగ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని హెచ్‌పిసిఎల్ అధికారి శ్రీహర్షను ఆదేశించారు. జిల్లాలో యాత్రకు చేసిన ఏర్పాట్లను జిల్లా స్థాయి నోడల్ అధికారి, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ ద్వారా తెలుసుకున్నారు. సమావేశంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, జిల్లా అదనపు ఎస్‌పి అస్మా పాల్గొన్నారు. అంతకుముందు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తో భేటీ అయ్యారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు.

ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంగన్వాడీలకు గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, తెలంగాణ కంటే వేతనం పెంచుతామన్నా ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 8నుంచి సమ్మె చేయనున్నామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం అర్బన్ సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం పెంచుతానని ఎన్నికల ముందు ప్రకటించి నేటికీ అమలు చేయకుండా జగనన్న మోసం చేశారని, శాంతియుత ప్రదర్శనలు, ధర్నాలను నిషేధిస్తూ జీవో నెంబర్ ఒకటి తీసుకొచ్చి నిర్బంధాన్ని ప్రయోగించారని అన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా మరింత పని భారం పెంచారని, లబ్ధిదారులను, పిల్లలను సెంటర్లకు దూరం చేసే నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు కావడంలేదనీ మరోవైపు ఉద్యోగులమని చెప్పి సంక్షేమ పథకాలు నిలిపివేశారని మండిపడ్డారు. ఈ సమస్యలపై డిసెంబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని లబ్ధిదారులు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో ప్రభ, విశాలాక్షి, సరళ, ప్రసన్న, శివలక్ష్మి అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-రాజాం

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాజాం పట్టణంలోని ప్రధాన రహదారి పనులను తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రాజాంలో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రహదారులు పల్లెటూర్లో ఉన్న రహదారుల కంటే అధ్వానంగా ఉన్నాయని, రోడ్ల విస్తరణ పేరుతో గత సంవత్సర కాలంగా ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు గురిచేస్తూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. రహదారులు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరిగి చాలామంది పలువురు గాయ పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం వస్తే రోడ్ల మీద అసలు నడిచే పరిస్థితి లేదని, ప్రజలు, ప్రయాణికుల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేయకపోతే ప్రజలంతా పోరాటానికి సన్నద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.శంకర్రావు, రామ్మూర్తి నాయుడు, తిరుపతిరావు, సత్యారావు, రమణ, విశ్వనాథం పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ

విజయనగరం టౌన్ : నగరంలోని పలువురు లబ్ధిదారులకు 3 లక్షల 75 వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అందజేశారు. హుకుంపేటకు చెందిన పోలిపల్లి లహరికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.30లక్షలు, బాలాజీ నగర్‌కు చెందిన పేమరాజు రమాదేవికి రూ.1.80లక్షలు, గుంకులాం గ్రామానికి చెందిన లెంక జగ్గు నాయుడుకు రూ.65 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మీడియాతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నుంచి ఇప్పటివరకు సుమారు కోటి రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పలువురు లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్పర్సన్ లెంక వరలక్ష్మి, 33వ డివిజన్ కార్పొరేటర్ జివి రంగారావు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటెందుకు వేయాలి?

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని, రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకపోయినా కేంద్రాన్ని అడగని జగన్‌కు ఎందుకు వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేయాలని టిడిపి నాయకులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నియోజక వర్గం ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో లక్కవరపుకోటలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒకటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. పేద వాడికి అన్నం పెడుతున్నో అన్నా క్యాంటీన్‌ను రద్దు చేసిన దుర్మార్గుడని విమర్శించారు. రాష్ట్రం కోసం 18 సార్లు ఢిల్లీ వెళ్లినా విభజన హామీల్లో ఒక్కటి కూడా సాధించలేకపోయారని అన్నారు. చివరికి విశాఖ రైల్వేజోన్‌ను కూడా సాధించలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు హయాంలో 78శాతం పూర్తి చేస్తే, జగన్ వచ్చిన తరువాత కనీసం 2శాతం కూడా పూర్తి చేయలేదని అన్నారు. జగన్‌ను రాజకీయ సమాధి చేయడం కోసం మనం అందరం పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

అన్న క్యాంటిన్‌ను సందర్శించిన అయ్యన్న

శృంగవరపుకోట : పేదల ఆకలి గుర్తించిన మంచి మనిషి చంద్రబాబు నాయుడు అని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో తాహశీల్దార్ కార్యాలయం ఎదుట 111 రోజులుగా దిగ్విజయంగా నిర్వహించబడుతున్న అన్న క్యాంటీన్ ఆయన మంగళవారం సందర్శించి పేదలకు భోజనాలను వడ్డించారు. అనంతరం అన్న క్యాంటిన్ వద్ద కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, విశాఖ జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జనసేన పార్టీ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ (సత్తిబాబు), వసంత్ విహార్ అధినేత వల్లూరి జయప్రకాష్ బాబు, కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో కలెక్టర్ పర్యటన

వేపాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఉదయం చేపట్టనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హాజరు కానున్నట్లు తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్ మంగళవారం తెలిపారు. 29 పంచాయతీలలో గల ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టరుకు చెప్పుకుని పరిష్కరించుకోవాలని కోరారు.

చంద్రబాబు బెయిల్ పై టిడిపి సంబరాలు

గజపతినగరం: స్కిల్ డవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో గజపతినగరంలో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. మంగళవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఆధ్వర్యంలో నియోజక వర్గ టిడిపి కార్యాలయం ముందు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని బాణా సంచా కాల్చి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దత్తిరాజేరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ లెంక చిన్నంనాయుడు, మీసాల అప్పలనాయుడు, ఎగ్గిని అప్పలరాజు, నాయకులు కరుమజ్జి కృష్ణ, కర్రి సత్యనారాయణ, మజ్జి గోవిందరావు, మిడతాన మహేష్, మిత్తిరెడ్డి హైమావతి, పైల శ్రీనివాసరావు, లక్ష్మునాయుడు, పాల్గొన్నారు.

జాయింట్ అకౌంట్ ఉత్తర్వులు రద్దు చేయాలి

బొబ్బిలి: జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కోసం జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. జెవిడి కోసం జాయింట్ బ్యాంక్ అకౌంట్ ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత పద్ధతిలో జెవిడి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బొబ్బిలి: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇటీవల గుండె శస్త్రచికిత్స జరగడంతో ఆయన ఆరోగ్యం తొందరగా మెరుగుపడాలని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు ఒకటవ వార్డు కౌన్సిలర్ చోడగంజి రమేష్ నాయుడు, 28వ వార్డు కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్, నాయకుడు దిబ్బ గోపి ఉన్నారు.

ఘనంగా జంగిల్ డే

బొబ్బిలి: స్థానిక శ్వేత చలపతి సంస్థాన ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం ది జంగిల్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పులి, ఒంటె, సింహం, ఏనుగు, జిరాఫీ, కోతి, నెమలి వేషధారణ వేసి సందర్శకులను అలరించారు. అడవులు, అటవీ ప్రాణుల్ని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ది జంగిల్ డే నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఫ్రాన్సిస్ జార్జ్, సంస్థాన పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం జి.అప్పారావు తెలిపారు. విద్యార్థులు వేసిన వేషధారణలు చూపరుల ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథం

శృంగవరపుకోట: భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ పవిత్ర గ్రంథమని దేశ ప్రజలను ఒక తాటిపై నడిపించేది భారత రాజ్యాంగమేనని ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి. సూర్యారావు అన్నారు. మంగళవారం వేదిక ప్రతినిధులు సిహెచ్ రామకృష్ణ, లంక సాంబమూర్తి, ఎస్. శ్రీనివాస్ కలిసి పట్టణంలోని ఒక ప్రైవేటు కమ్యూనిటీ హాల్‌లో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ఈ నెల 25 శనివారం రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరారు.

అధికారుల పనితీరుపై ఎస్ఓ ఆరా

రేగిడి : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం చేయూత పథక సంచాలకులు, మండల ప్రత్యేకాధికారి కళ్యాణ్ చక్రవర్తి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు శాఖల పనితీరు పై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, వాటి నిర్వాహణలు అధికారులు వేగవంతం చేయాలని సూచించారు. హౌసింగ్ ఎఇ జగన్నాథంతో మాట్లాడుతూ హౌసింగ్ ప్రగతి సాధించాలన్నారు. జలజీవన పథకంతో అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్‌కు సూచించారు. మనబడి, నాడు నేడు పథకంలో భాగంగా నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల జెఇ రామకృష్ణారావును ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ శ్యామల కుమారి, తహశీల్దార్ సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

నెల్లిమర్ల: శ్రీ శయన(సెగిడి కులం) ఐక్యత, అభివృద్ధి కోసం సహకరించాలని ఆ కార్పొరేషన్ చైర్మన్ దండి వంకాజ్యన్ దేవ్ కోరారు. మంగళవారం స్థానిక సెగిడిపేట ఆంజనేయస్వామి గుడి వద్ద జరిగిన శ్రీశయన సంక్షేమ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం తలపెట్టిన కులగణనను శ్రీశయన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ గౌరవాధ్యక్షులు కోల బలరామ్ మాస్టారు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెండలోల బహదూర్ శాస్త్రి, కార్యదర్శి జనుకోటి ఈశ్వరరావు, వీర్ల సింహచలం, శనపతి అప్పలస్వామి, మాజీ కౌన్సిలర్ ముడుమంచి లక్ష్మణ, ముడుమంచి ప్రసాద్, గుజ్జల ఆదినారాయణ, శనపతి శ్రీరాములు పాల్గొన్నారు.

ద్వారపూడిలో వైద్య శిబిరం

డెంకాడ: విజయనగరం మండలంలోని ద్వారపూడిలో రాజా సాహెబ్ డాక్టర్ పి.వి.జి రాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మిమ్స్ వైద్యుల సహకారంతో ఎంవిజిఆర్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ ప్రత్యేక వైద్య శిబిరానికి మిమ్స్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాలకు చెందిన పలువురు వైద్యులు పాల్గొని గ్రామంలోని దాదాపు 87 మందికి పరీక్షలు నిర్వహించి 16 మంది రోగులను ఆర్థో, ఆప్తాల్మాజీ ఆపరేషన్‌లకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏ ప్రధానోపాధ్యాయుడు ఎన్ మోహన్ కుమార్, డీన్ ఎన్.షణ్ముఖ రావు, పిఒ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉప్పాడ పరామర్శ

ప్రజాశక్తి – భోగాపురం

విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మండలానికి చెందిన బాధితులను మండల వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. మండలంలోని చేపలకంచేరు, ముక్కాం, యర్రమసయ్యపేటం గ్రామాలకు చెందిన 12 బోట్లు ఈ ప్రమాదంలో కాలిపోయాయి. చేపలకంచేరు సర్పంచ్ అరజల్ల నర్సింగరావుకు చెందిన రెండు బోట్లు కాలిపోవడంతో ఆయనను కూడా పరామర్శించారు. ప్రమాదం ఏవిధంగా జరిగిందో అడిగితెలుసుకున్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సూర్యనారాయణరెడ్డి వారికి ధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట ఎంపిటిసి తాతయ్యలు, నాయకులు దల్లి బంగారురెడ్డి, దాట్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనం వేలం

డెంకాడ : స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈ నెల 23న హీరో ప్లెజర్ ద్విచక్ర వాహనాన్ని వేలం వేస్తామని ఎస్ఐ యు. మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల క్రితం మద్యం తరలిస్తు కేసులో పట్టుబడిన ఈ వాహనాన్ని ఉదయం 10గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి కలవారు వేలం పాటలో పాల్గొనవచ్చునని చెప్పారు.

సత్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

విజయనగరం : స్థానిక తోట పాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎస్. పల్లవి, సి హెచ్ శ్రీలక్ష్మి ఈనెల 17నుంచి 19వ వరకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట లో జరిగిన 10వ రాష్ట్ర అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో పతకాలు సాధించారు. పల్లవి 64కేజీల విభాగంలో బంగారు పతకం, సిహెచ్ లక్ష్మి 81 కేజీల విభాగంలో రజత పతకం సాధించారు. తైక్వాండో కరేగోలో షేక్ నూరున్నిషా ఆంధ్ర యూనివర్సిటీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అంతర్ కళాశాల పోటీలో ప్రథమ స్థానం సాధించింది. రాజస్థాన్‌లో జనవరిలో జరిగిన జోన్ పోటీలలో కూడా ప్రథమ స్థానం పొంది జాతీయ స్థాయి అంతర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎ సి సి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ శ్రీ చల్లా రాము తదితరులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న శశిభూషణరావు

మరోసారి మద్దతివ్వండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి – నెల్లిమర్ల

జగన్‌కు మరోసారి సిఎంగా మద్దతు ప్రకటించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు కోరారు. మంగళ వారం నగర పంచాయతీలో పద్మ శాలి వీధి 5వ సచివాలయం, డిజిటల్ బోర్డు ఏర్పాటు, ఏపికి జగన్ ఎందుకు కావాలి, మొయిద జంక్షన్ 2వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బైరెడ్డి సూర్య నారాయణ కల్యాణ మండపంలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి జగన్ మోహన్ రెడ్డికి సిఎంగా మద్దతు ఇవ్వాలని కోరారు. జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాల అందజేసారన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజినీ, శంకర రావు, వైస్ ఛైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబ శివరావు, కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, చిక్కాల సంతోష్, నాగ వంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, రహదారి భవనాలు కార్పొరేషన్ డైరెక్టర్ నౌపాడ శ్రీనివాస రావు, నాయకులు పాండ్రంకి సత్యనారాయణ, బూర సత్య నారాయణ, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, మెప్మా సిఎంఎం డి. గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మున్సిపాల్టీ పరిధిలోని 13వ సచివాలయంలో మంగళవారం ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు ఆధ్వర్యంలో చేపట్టారు. ముందుగా సచివాలయం పరిధిలో ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పొందిన సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను తీసుకువచ్చేందుకు సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని ప్రస్తుతం సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాల్ రావు, వార్డు కౌన్సిలర్ మరిపి తిరుపతి రావు, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సీతాదేవి,పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

బొండపల్లి: అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సంక్షేమ సారథి జగన్మోహన్ రెడ్డి అని ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎంపిపి చల్ల చలంనాయుడు కోరారు. మంగళవారం నెలివాడ గ్రామ పంచాయతీ ఆవరణంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఏపికి జగనే ఎందుకు కావలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేదలు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సిఎం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, పిఎసియస్ అధ్యక్షులు మహంతి రమణ, నెలివాడ, బి.రాజేరు సర్పంచ్‌లు తాళ్ళపూడి కీర్తి, ఈదుబిల్లి కృష్ణ అధికారులు పాల్గొన్నారు.

డెంకాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు అన్నారు. మండలంలోని గుణుపూర్ పేట లో మంగళవారం ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించి ప్రభుత్వ పథకాలతో కూడిన సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మి, వైస్ ఎంపిపి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, సర్పంచ్ పైల ముత్యాలరావు, రాము నాయుడు, కోరాడ కనకరాజు, అట్టాడ శివకృష్ణ, వైస్ సర్పంచ్ చిన్న పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: సోంపురం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా సంక్షేమ బోర్డును ఎంపిపి సత్యవంతుడు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సోంపురం గ్రామానికి ఇంతవరకు సంక్షేమ పథకాలు కింద రూ. 14 కోట్లు అందాయన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మరల జగన్‌ను సిఎంను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం. కస్తూరి, కో–ఆపరేటివ్ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గు బాబు, బిసి జిల్లా సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్ మురిపిండి గంగరాజు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, బుద్ధ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి – భోగాపురం

ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని విజయనగరం తహశీల్దారు కోరాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని కార్యదర్శులు, విఆర్‌ఒలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల సహాయంతో ఈ సర్వేను పక్కాగా చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన సూచనలు మేరకు వారి నుంచి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏవిధంగా చేయాలో వారికి శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు ప్రస్తుతం వాలంటీర్ల వద్దనున్న సెల్‌ఫోన్లు, డివైజర్లు సక్రమంగా పనిచేయడం లేదని దీని వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడే అవకాశం ఉందని కొంతమంది కార్యదర్శులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. పూసపాటిరేగ తహశీల్దారు ఇమంది భాస్కరరావు, ఇఒపిఆర్‌డి సురేష్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కుల గణన పక్కాగా నిర్వహించాలని తహశీల్దార్ డి. ధర్మ రాజు, ఎంపిడిఒ జి.రామారావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై పంచాయతి కార్యదర్శులు, సచివాయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 16 సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కుల గణన పక్కాగా చేయాలని సూచించారు. ప్రతీ ఇంటిలో ఏఏ కులాల వారు ఉన్నారో పరిశీలించి నమోదు చేయాలన్నారు. వారికి కులాల వారిగా అందుతున్న పథకాలు వివరాలు గుర్తించి పక్కాగా కుల గణన చేయాలని సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురం: మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

బొబ్బిలిరూరల్ : ప్రతి ఇంటికీ వెళ్లి కుల గణన నిర్వహించాలని జిల్లా బి.సి వెల్ఫేర్ అధికారి బి.రామానందం, తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ రవి కుమార్‌లు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శిలు, విఆర్‌ఒలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో కులం, ఉపకులం, వృత్తి, ఇంటి పెద్ద, చదువు, తదితర వివరాలు సేకరించాలన్నారు. ఈ సర్వే వల్ల ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులూ లేవని తెలియజేస్తూ ప్రజల భాగస్వామ్యంతో సర్వే నిర్వహించాలని సూచించారు.

మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయంలో కులగణనకు సంబంధించి తెర్లాం ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 20,21,22 తేదీలలో వివిధ మండలాల్లో శిక్షణలు నిర్వహించి 27 నవంబర్ నుండి అన్ని గ్రామాలలోను కులగణన సర్వే చేపడతారని చెప్పారు. సచివాల యాల ఉద్యోగులు ఆయా సచివాలయాల పరిధిలో ఇంటిం టికి వెళ్లి వివరాలు సేకరించి ఖచ్చితమైన సమాచారం అధికారులకు నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెర్లాం తహశీల్దార్ రత్నకుమార్, మెరకముడిదాం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తలగాం దళితుల భూ సమస్య పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి – వంగర

తలగాం దళితుల భూ సమస్య వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన వంగరలో డిప్యూటీ తహశీల్దార్ బి సుందరరావును మంగళవారం కలిసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలగాం గ్రామానికి చెందిన దళితులు అదే గ్రామ పరిధిలో కొంత భూమిని సాగు చేయగా దానిని కొంతమంది అగ్రకుల భూస్వాములు అక్రమంగా సాగు చేస్తున్నారని, పరిశీలించి దళితులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ బి సుందరరావు మాట్లాడుతూ ఈ విషయంపై జిల్లా అధికారులకు నివేదిక అందజేశామన్నారు. తదుపరి జిల్లా అధికారులు ఆదేశాల వచ్చిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి శంకర్రావు, విశ్వనాథం, త్రినాధరావు, తలగాం దళితులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత: జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి– బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 23న బొబ్బిలిలో జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలని శ్రీకళాభారతిలో మంగళవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిను సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. సామాజిక సాధికార బస్సుయాత్రకు ప్రజలు హాజరయ్యేలా చూడాలని కోరారు. గత పాలకుల పాలనలో బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న వైసిపిని గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ గతంలో బొబ్బిలి నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని, తన హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ఐక్యంగా పని చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర నాయకులతో కలిసి సభ స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు, జేసీఎస్ కన్వీనర్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్

ప్రజాశక్తి – వేపాడ

గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నామని వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి చెప్పారు. ఆమె మంగళవారం ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ గ్రామంలో టిడిపి హయామంలో ఎటు వంటి అభివృద్ధి జరగలేదు. వైసిపి సర్పంచ్‌గా నేను రెండు సార్లు విజయం సాధించి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేశాను. రూ. 25లక్షలతో గ్రామ సచివాల యాన్ని నిర్మించాం. రూ. 20లక్షలతో వెల్‌నెస్ భవనం, ఆర్‌బికె నిర్మాణాలను కూడా పూర్తి చేస్తున్నాం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో రెండు కమ్యూనిటీ భవనాలు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. పంచాయతీ నిధులతో రెండు సిసి రోడ్ల నిర్మాణానికి తీర్మానం చేశాం. ఇంటి స్థలం లేని వారిని 12 మందిని గుర్తించి వారికి పక్కా గృహాలు మంజూరు చేశాం. కడకొండ గిరిజన గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా రూ.5.45 లక్షలు, సంజీవమెట్టకు రూ. 6లక్షలు వెచ్చించి ఇంటింటికి తాగునీరు అందిస్తున్నాం. నాడు నేడు నిధులు రూ. 9.30లక్షలతో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులు చేపడుతు న్నాం.దీంతో పాటు ప్రాథమిక పాఠశాల ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలను కూడా చేపడుతున్నాం. గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా రూ.80 లక్షల మంజూరు చేశారు. నిధులు విడుదలైన వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టి ప్రతి ఇంటికి తాగునీరు అందే విధంగా తగు చర్యలు తీసుకుంటాం. ఈ మధ్య కాలంలో కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలకు చేపడు తున్న పనులకు ఏ విధమైన పొంతనాలూ లేవు. గ్రామంలో చేపడుతున్న ప్రతి అభివద్ధి పని పాలకవర్గ సభ్యులు ఆమోదం మేరకే చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

సర్పంచ్ రాజేశ్వరి

కార్మికులకు అండగా సిఐటియు

ప్రజాశక్తి – వంగర

కార్మికులకు ఎల్లప్పుడూ సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి శంకర్రావు, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఈ నెల 25న వంగర మండల కేంద్రంలో జరుగు భవన నిర్మాణ కార్మిక సంఘం మండల 2వ మహాసభ లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని మంగళవారం ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహాసభలో రాష్ట్ర ప్రభుత్వం భవనిర్మాణ కార్మికులకు చేసిన అన్యాయంపైనా, భవిష్యత్తు పోరాటా లను చర్చిస్తామని అనేక ఏళ్లుగా పోరాడి సాధించుకున్న భవనిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 40 లక్షల భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు సంక్షేమ బోర్డు ద్వారా ఉన్న సంక్షేమాన్ని అనుభవించే పరిస్థితి లేదన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా భవననిర్మాణ కార్మికులకు ఈ ప్రభుత్వం వల్ల ఏ ఒక్క ఆర్థిక ప్రయోజనం గాని అదనంగా సంక్షేమ పథకాన్ని గాని అమలు చేసిన పరిస్థితి లేదన్నారు. తక్షణమే భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమ ంలో ఆదినారాయణ, ఆదినాయుడు, రమణ, అప్పల నాయుడు, రామి నాయుడు, రమణ, లక్ష్మణ, త్రినాధ, విశ్వనాథ రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

వ్యవసాయ పద్ధతుల పరిశీలన

ప్రజాశక్తి – బొబ్బిలిరూరల్

ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ కోసం యోగ్యమైన వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్న రైతు పొలాలను మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ నుంచి వచ్చిన ఎక్సటర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్ రవి పరిశీలించారు. అలజంగి, కారాడ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న పొలంబడి రైతుల పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఇండి గ్యాప్ ధ్రువీకరణ పత్రం పొందటానికి అవసరమైన అన్ని నాణ్యత ప్రమాణాలను, నియమ నిబంధనలను రైతులు అవలంబిస్తున్నారా లేదా అని రైతుల పొలాల్లో తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. పంట నుండి కొంత శాంపిల్ కూడా తీసుకొని వాటిలో పురుగుమందుల అవశేషాల పరీక్ష కోసం బెంగళూరు లేబరేటరీకి పంపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ యం. శ్యాంసుందర్, వ్యవసాయ సహాయకులు సంతోషి, లత, శ్రీ రామచంద్ర ఫార్మర్ ప్రొడ్యూస్ కంపెనీ సిఇఒ ఢిల్లేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

బొండపల్లి : మండలంలోని ఎం. కొత్తవలస, వెదురువాడ గ్రామాలకు వాలంటీర్లుగా ఎంపికైన యస్ సత్యవతి, బి.శిరీషలకు మంగళవారం ఎంపిపి చల్ల చలంనాయుడు, ఎంపిడిఒ వైవి రాజేంద్ర ప్రసాద్‌లు వాలంటీర్ నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విధుల పట్ల నిబద్ధతతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముద్దూరు సర్పంచ్ మునకాల పైడిపునాయుడు పాల్గొన్నారు.

బోరు బావులు మంజూరు

బొండపల్లి: మండలంలోని నెలివాడ, అంబటివలస గ్రామాలకు బోరు బావులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మంజూరు చేసిన ఈ బోరు బావులను నెలివాడలో అభయాంజనేయ స్వామి గుడి వద్ద భక్తుల తాగు నీరు నిమిత్తం వేశారు. ఈ బోరు బావిని వైసిపి నాయకులు తాళ్ళపూడి అప్పలనాయుడు ప్రారంబించారు. అంబటివలస శ్మశాన వాటికలో ఎంపిటిసి అప్పలనాయుడు బోరు రిగ్‌ను ప్రారంబించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

రేగిడి : మండలంలోని ఉంగరాడ మెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విజయవాడ హస్తకళల సేవా కేంద్రం, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన హస్త కళలు తయారీ విధానం, వ్యాసరచన, డ్రాయింగ్, క్రాఫ్ట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. గత మూడు రోజుల నుంచి నిర్వహించిన ఈ రెండు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన 50 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ఎల్‌డిసిడి సుదీప్, ఎంటిఎస్ షేక్ మహబూబ్, డి సూర్యనారాయణ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూ హెూప్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై ప్రభుత్వం చిన్నచూపు

విజయనగరం టౌన్ : మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని, మత్స్యకారులకు పెద్దపీట వేస్తామన్న ముఖ్యమంత్రి జగన్ హామీలు ఏమయ్యాయని, జనసేన పార్టీ రాష్ట్ర మత్స్యకార కమిటీ చైర్మన్ బొమ్మిడి నాయకర్ ప్రశ్నించారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంట స్తంభం ప్రాంతంలో గల మత్స్యకారులను కలిసి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం మత్స్యకార సామాజిక వర్గంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వారిని చూస్తున్నారన్నారు. విజయనగరం శ్రీకాకుళం జిల్లాలో, ఒక్క జట్టీ కూడా నిర్మించకపోవడం మత్స్యకారులపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తుందన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎప్పటినుంచో మత్స్యకార సమస్యలపై ప్రశ్నిస్తున్నారని తెలిపారు. విశాఖపట్నం హార్బర్‌లో జరిగిన బోటు ప్రమాదం పై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి సాయం అందిస్తున్నారని తెలిపారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి మాట్లాడుతూ మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో పిఎసి సభ్యులు, మాజీ మంత్రి పడాల అరుణ, గనగల రాజు, రౌతు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ పరిశ్రమలతో జాగ్రత్తలు అవసరం

విజయనగరం: కెమికల్ పరిశ్రమలతో జాగ్రత్తలు అవసరమని ఆర్‌డిఒ సూర్యకుమారి అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం స్థానిక సంక్షోభంపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కెమికల్ పరిశ్రమల్లో ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు వాటికి తీసుకోవలసిన చర్యలు గురించి వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు, ఇతర కెమికల్ ఇండస్ట్రీస్ యాజమాన్యం, నాన్ గవర్నమెంట్ ఆర్గ నైజషన్‌తో ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ సూర్యకుమారి మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో తీసుకోవలసిన భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అన్ని శాఖల అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల ఇంఛార్జి ఇన్‌స్పెక్టర్ జివివి సత్యనారాయణ, జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి సోమేశ్వరరావు, వివిధ మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎస్‌ఐలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి– బొబ్బిలి

ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ఆర్‌డిఒ ఎ. సాయిశ్రీను పెంట రైతులు కోరారు. ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆర్‌డిఒ సాయిశ్రీకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు గేదెల త్రినాధ, జి.రమణ, చుక్క సింహచలం మాట్లాడుతూ వేగావతి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేయడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, నది పరివాహక భూములు కోతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసి తమకు న్యాయం చేయాలని కోరారు. రాత్రి సమయాల్లో ఇసుక తవ్వి తరలిస్తున్నారని చెప్పారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

బాడంగి: ఎంతో కష్ట పడి చదివినా ఉద్యోగం రాలేదని బాధతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జయంతి కధనం ప్రకారం.. మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన పామెటి శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తిరుపతినాయుడు (28) చాల సంత్స రాలుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం సిద్ధమవుతున్నాడు. తోటి స్నేహితుల ఒదరికీ ఉద్యోగాలు వచ్చినా తనకి రాలేదని మనస్థాపంతో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. తరు వాత ఇంటికి వచ్చిన చిన్న కుమా రుడు చూసి తండ్రికి, కుటుంబం సభ్యులకు ఫోన్ చేసి వైద్యం కోసం బాడంగి సిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి అక్కడ నుండి విశాఖ కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

వంగర: మండలంలోని కోనంగిపాడు గ్రామానికి చెందిన మక్కా నారాయణరావు, గొర్లె సన్యాసి నాయుడు ఇరువురు ఓ గోడ విషయంపై ఘర్షణ పడుతుండగా శ్రీకాకుళంకు చెందిన (మేస్త్రి) తంగి వాసు వారిద్దరిని విడిపించాడు. దీంతో గొర్లె సన్యాసి నాయుడుకు చెందిన నలుగురు వ్యక్తులు తంగి వాసు పై దాడి చేసి గాయ పరచడంతో ఆయన వంగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సన్యాసి నాయుడికి చెందిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆర్. జనార్దన్ రావు తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీసు

భోగాపురం: అంగన్వాడిలకు వేతనాలు పెంపుదల చేయాలని భోగాపురం సిడిపిఒ ఎస్తేరు రాణికి యూనియన్ నాయకులు సమ్మె నోటీసు ను అందజేశారు. సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీవీ రమణ, జిల్లా కార్యదర్శి బచ్చుల సూర్యనారాయణ ఆధ్వర్యంలో నోటీసులు అందజేశారు. అంగన్వాడీలకు వేతనాలు, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి ఇతర సమస్యలు అమలు చేయాలని యూనియన్ నాయకులు కోరారు. లేనిపక్షంలో డిసెంబర్ 8 నుంచి నిరవదిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్ట్ కార్యదర్శి ఎం కృష్ణవేణి, సెక్టర్ లీడర్లు పి అనిత, చిన్నమ్ములు, పి సుజాత, కే ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

10న కార్తీక సమారాధన

విజయనగరం టౌన్: విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 10న రామనారాయణం దగ్గర గల తోటలో నాగవంశీయుల కార్తీక సమారాధన నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు అవనాపు విక్రమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగవంశీయులు అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నాగవంశీయ విద్యార్థులకు ప్రతిభ పురష్కారాలను అందిస్తామన్నారు. కార్తీక వన సమారాధనలో మహిళలకు, పిల్లలు, పెద్దలకు, యువతకు వినోదాన్ని ఇచ్చే విధంగా కార్యక్రమాలను రూపొందించామన్నారు. సమావేశంలో కాళ్ల గౌరీశంకర్, అవనాపు విజయ్, జి.అప్పారావు పాల్గొన్నారు.